# అధ్వాన రోడ్డుతో అవస్థలు

- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న నర్సింహాపురం రహదారి
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- బీటీరోడ్డుగా మార్చాలని గ్రామస్తుల డిమాండ్


బురదమయంగా ఉన్న నర్సింహాపురం రహదారి

**మునగాల :** మండలంలోని ఆకుపాముల -నర్సింహాపురం మధ్య గల 2కిలోమీటర్ల రహదారి గుంతలమయంగా బురదతో అధ్వానంగా మారి రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారికి నిధులు మంజూరు చేసి మట్టిరోడ్డును బీటీరోడ్డుగా మార్చడానికి గత పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వివక్ష చూపారని నర్సింహాపురం గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలుకొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకొని పది సంవత్సరాలు దాటినా, మూడు ప్రభుత్వాలు కొలువుదీరి రెండు పార్టీలు అధికారం చేపట్టినా, పలువురు ప్రజాప్రతినిధులు మారినా రహదారి రూపురేఖలు మాత్రం మారడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారి మీదుగా నాలుగు మండలాలు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఈ గ్రామం నుంచి నిత్యం రైతులు, ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. వర్షం వస్తే ఈ రహదారిపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. మరి ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డులో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు కిందపడుతున్నారు. కోదాడకు 5కిలోమీటర్లు, మండల కేంద్రానికి 8కిలోమీటర్ల దూరంలో ఉన్న రహదారిని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారికి నిధులు మంజూరు చేసి మట్టిరోడ్డును బీటీరోడ్డుగా మార్చాలని గ్రామప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### బీటీరోడ్డుగా మార్చాలి



గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. మోకాళ్ల లోతు గుంతలతో పాటు రహదారికి ఇరుపక్కలా కంపచెట్లు అల్లుకొని రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల నాయకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నర్సింహాపురం-ఆకుపాముల రోడ్డును బీటీరోడ్డుగా మార్చాలి.

– వేమూరి సత్యనారాయణ, నర్సింహాపురం

### ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

ఆకుపాముల -నర్సింహాపురం రహదారిని బీటీరోడ్డుగా మార్చాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. కానీ నేటివరకు నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం కంకర తేలి ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు కూడా ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

– వసంత, పంచాయతీరాజ్ ఏఈ, మునగాల

## రైతుల ఫిర్యాదులతో ఆర్డీఓ విచారణ


విచారణ చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, మైనింగ్, అటవీశాఖల అధికారులు

**పాలకవీడు :** మండలంలోని కల్మేట్‌తండా గ్రామానికి చెందిన వడిత్య సుధాకర్ జాన్‌పహాడ్ దర్గాకు చెందిన స్వామి అనే ఇరువురు రైతుల పంట పొలాల పక్కనే డెక్కన్ సిమెంట్ పరిశ్రమ మైనింగ్‌లో బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో తమ పొలాల్లో రాళ్లు పడుతున్నాయని, మరో రైతు తమ పంట పొలానికి నీటి అవసరం కోసం వేస్తున్న పైప్‌లైన్ అడ్డుకుంటున్నారని ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీఓ శ్రీనివాసులు, రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. పరిశ్రమ మైనింగ్ అనుమతులు, రైతుల భూ వివరాలను పరిశీలించి తుది నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. విచారణలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కమలాకర్, మైనింగ్ జిల్లా ఏడీ రామరాజు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి మల్లేష్, జిల్లా సర్వేయర్ వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## సేఫ్టీ మోకులు గీత కార్మికులకు మేలు


సేఫ్టీ మోకులపై అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

**చిలుకూరు :** సేఫ్టీ మోకులతో గీత కార్మికులకు మేలని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సేఫ్టీ మోకులపై బుధవారం మండలంలోని బేతవోలు గ్రామంలో ఆయన కార్మికులకు అవగాహన కల్పించారు. గీత కార్మికులకు ప్రమాదం జరగకుండా ప్రభుత్వం సేఫ్టీ మోకులను అందజేస్తుందన్నారు. దశల వారీగా అందరికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధికారి అనసూయ, ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కొండా అన్నపూర్ణ, పుల్లారావు, గీత కార్మికులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రతినిధిగా బాణోతు అనూష


నియామక పత్రం అందుకుంటున్న అనూష

**అనంతగిరి :** మండలంలోని కొత్తగోల్‌తండా గ్రామానికి చెందిన బాణోతు అనూష బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రతినిధిగా నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్‌నాయక్ అనూషకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాణోతు అనూషానాయక్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

### పేదరికంలోనే 80కోట్ల మంది ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

**కోదాడరూరల్ :** స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దేశంలో 80కోట్ల మంది పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని లాల్‌బంగ్లాలో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేవిడ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామల్ల నవీన్, గంటా నాగయ్య, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, సైదులు, నరసింహారావు తదితరులు ఉన్నారు.

### గుండ్లపల్లి ఎత్తిపోతల నుంచి సాగునీరు విడుదల

**మఠంపల్లి :** మండలంలోని గుండ్లపల్లి వద్ద కృష్ణానదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం నుంచి బుధవారం ఐబీ డీఈఈ గన్నా భిక్షం స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐబీ ఏఈఈ తుమ్మల శ్రీనివాస్‌గౌడ్, రైతులు భద్రారెడ్డి తదితరులున్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్


ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎం.భీమార్జునరెడ్డి మిర్యాలగూడెంలోని కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లారు. శ్రీనివాస్ హైదరాబాద్ శివారులోని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడిగా పనిచేస్తూ హుజూర్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం ప్రియాంక, రామారావు, సునంద, డా.నగేష్, బాలరాజు, శ్రీనివాసరావు, నాగార్జున, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు మాలతీ, మట్టయ్య, యోగి పాల్గొన్నారు.

### పాఠశాలలో రాఖీల పదర్శన


విద్యార్థులు తయారు చేస్తున్న రాఖీలు

**చిలుకూరు :** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్న మల్లం ఝున్సీరాణి విద్యార్థులతో తయారు చేయించిన రాఖీలను బుధవారం పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం గుండు ఆదినారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులతో రాఖీలు తయారు చేయించిన టీచర్‌ను, విద్యార్థులను ఆయన అభినందించారు. ఊలు దారం, కలర్‌పూసలు, స్టోన్‌లెస్ బిల్లలు, సూదులు, గమ్ము సాధారణ వస్తువులతో తక్కువ ఖర్చుతో రాఖీలు తయారు చేసినట్లు టీచర్ ఝున్సీరాణి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి


హుజూర్‌నగర్ : తిరంగా ర్యాలీలో పాల్గొన్న బొబ్బా భాగ్యరెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి తదితరులు

**హుజూర్‌నగర్ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్ర అభియాన్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తిరంగా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ పౌరులందరూ విధిగా తమ ఇంటిపై తివర్ణ పతాకాలను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలత, అసెంబ్లీ కన్వీనర్ అంబళ్ల నరేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి, జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, జిల్లా కార్యదర్శి గుండెబోయిన వీరబాబు, నాయకులు కుక్కడపు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి అంజయ్య, నరినాయక్, కుందూరు కోటిరెడ్డి, గుండ్రెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కీత శ్రీను, పార్థ నబోయిన విజయ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

**మహనీయుల త్యాగాలతోనే స్వాతంత్ర్యం**

**కోదాడరూరల్ :** ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని సర్వేజన ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు కవితా అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రంగా థియేటర్ సెంటర్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశభక్తిని కలిగించేలా విద్యార్థులు జాతీయజెండాలతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రసాదరావు, జనార్దన్, ఎంఎల్ఎన్ రెడ్డి, రాధిక, అచ్యుత్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.


కోదాడరూరల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న సర్వేజన ఫౌండేషన్ చైర్మన్ కవితాఅమరేందర్‌రెడ్డి

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన


హుజూర్‌నగర్ క్యాంప్ హైస్కూల్లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ముత్తయ్య


నడిగూడెం : పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**హుజూర్‌నగర్ :** సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంప్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సెల్‌ఫోన్ ద్వారా జరిగే సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐ జుట్టుకొండ రమేష్, కానిస్టేబుళ్లు నరేష్, రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**అనంతగిరి :** గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై యువత అవగాహన కలిగి ఉండాలని కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమీనాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మిషన్ పరివర్తన్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గంజాయి సేవించడం, క్రయవిక్రయాలకు సంభందించిన సమాచారం 100కి కాల్ చేసి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**నడిగూడెం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో బుధవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముక్తా భారత్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్

**హుజూర్‌నగర్‌రూరల్ :** విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నిరంజన్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గోపాలపురంలో విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు చీకూరి లీలావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పరిసరాల పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు బాగున్నప్పుడే తమ ఆరోగ్యం బాగుంటుందన్నారు. అనంతరం గ్రామంలో విషజ్వరాల బారిన పడినవారిని పరామర్శించి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## కోదాడలో 200 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ


ర్యాలీగా వస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

**కోదాడరూరల్ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కోదాడ పట్టణంలో ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్(ఐవీఓ) ఆధ్వర్యంలో 200 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల ప్రారంభించారు. బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్, రంగాథియేటర్ సెంటర్ మీదుగా నూతనంగా నిర్మిస్తున్న 100 అడుగుల జాతీయ జెండా స్థలం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఐవీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు, గుండపునేని నాగేశ్వరరావు, జగిని ప్రసాద్, నవీన్, రమేష్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం

**కోదాడరూరల్ :** ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడమే ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ (ఐవీఓ) లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 100అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణను పురస్కరించుకొని బుధవారం విద్యార్థులు, పలు సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐవీఓ జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు, గుండపునేని నాగేశ్వరరావు, జగిని ప్రసాద్, శేకు రమేష్, గోవిందా నవీన్, శారధ, భగత్, సత్యమూర్తి, అరుణ్, సతీష్, వెంకటనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో చిన్నారి మృతి

**చిలుకూరు:** అనారోగ్యంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన అమరగాని శ్రీధర్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె సంధ్య గ్రామ పరిధిలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 10వతరగతి చదువుతోంది. రెండో కుమార్తె భవ్యశ్రీ(13) అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. భవ్యశ్రీకి మంగళవారం ఉదయం తీవ్రజ్వరం రావడంతో తల్లిదండ్రులు వెంటనే కోదాడలోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోగా బీపీ తగ్గి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఖమ్మంకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో బుధవారం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. చిన్నారి మృతి పట్ల గ్లోబస్ పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, కవిత కళాశాల కరస్పాండెంట్ మాదాల శ్రీధర్, కవిత, శ్రీవిద్య కళాశాల ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వరరావు, గద్దె రఘు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

## మేజర్‌కాల్వలో పూడిక తొలగించాలని ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**హుజూర్‌నగర్ రూరల్ :** లింగగిరి మేజర్‌కాల్వలో ఉన్న పూడికను తొలగించి ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగగిరి మేజర్‌కాల్వలో ఆయకట్టు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కాల్వ 9కిలోమీటర్ల పరిధిలో సుమారు 6వేల ఎకరాలకు పైగా భూములకు సాగునీరు అందాల్సి ఉందని, రెండు సంవత్సరాలుగా ఆయకట్టుకు సాగునీరు రాకపోవడంతో హుజూర్‌నగర్ పట్టణ ప్రాంత పరిధిలో కేవలం 3కిలోమీటర్ల మేర కాల్వలో చెత్తాచెదారం, రాళ్లతో నిండుకొని ఉండడంతో కేవలం 6కిలోమీటర్ల దూరం వరకు మాత్రమే సాగునీరు వస్తుందన్నారు. మిగిలిన 3కిలోమీటర్ల ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఏఈ శ్రీనివాస్‌తో మాట్లాడి తక్షణమే కాల్వలో ఉన్న పూడికను తొలగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ అధ్యక్షుడు పాశం వీరబాబు, ప్రజా సంఘాల నాయకులు శీలం శ్రీను, పోషణబోయిన హుస్సేన్, మురళి, వెంకటనారాయణ, వీరస్వామి, వెంకట్ నర్సింహారావు, ఎల్లయ్య, వెంకన్న, రైతులు తదితరులు ఉన్నారు.

## విద్యాభివృద్ధికి కెనరా బ్యాంక్ సహకారం


స్కాలర్‌షిప్ చెక్కులు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ బాలాజీ, హెచ్ఎం జయవాణిదేవి

**హుజూర్‌నగర్ :** విద్యాభివృద్ధికి కెనరా బ్యాంక్ తన వంతు సహాయ సహకారాలు అందిస్తుందని బ్యాంక్ మేనేజర్ వాంకుడోతు బాలాజీ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కెనరా విద్యాజ్యోతి పథకంలో భాగంగా విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫీసర్ అజ్మీరా రామ్‌లాల్, హెచ్ఎం జయవాణిదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ శ్రీదేవి, మాతంగి ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, విజయలక్ష్మి, శైలజ, అస్మాముబిన్, అరుణారాణి, జనార్దన్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


బోనాలతో వస్తున్న మహిళలు, గ్రామపెద్దలు

**మఠంపల్లి :** మండలంలోని బాడవాతండాలో బుధవారం శ్రీప్రసన్నాంజనేయస్వామి మూడో వార్షికోత్సవాన్ని, వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయికి బోనాల సమర్పణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలోని గిరిజనులు, మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో ఊరేగింపు నిర్వహించి బొడ్రాయికి నైవేధ్యంగా సమర్పించారు. అదే విధంగా తండాలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మండల మాజీ జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ ధరావత్ గోవింద్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ బాలునాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బానోతు శ్రీనునాయక్, వినాయకుడి విగ్రహ దాత ధరావత్ నాగానాయక్, ఉత్సవ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముమ్వన్నెల కాంతుల్లో పులిచింతల ప్రాజెక్టు

**హుజూర్‌నగర్ :** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టు మువ్వన్నెల కాంతులతో మెరిసిపోతోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు ప్రాజెక్టును కాషాయం, తెలుపు, ఆకుపచ్చ వర్ణాల విద్యుత్ దీపాలతో మంగళవారం రాత్రి అలంకరించారు. సాయంత్రం కృష్ణానదిలో నీరు కూడా మూడు రంగుల్లో దర్శనమిస్తోంది.



## సంక్షిప్త సమాచారం

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**గరిడేపల్లి :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ ఛత్రునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన బొంత వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు విద్యార్థులకు అందజేసిన రూ.15వేల విలువ గల క్రీడాదుస్తుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదే విధంగా మండలం కేంద్రంలోని కెనరా బ్యాంక్ సౌజన్యంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలకు విద్యాజ్యోతి పథకం కింద ఒక్కొక్కరికి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో బొంత మట్టారెడ్డి, లక్ష్మి, బ్యాంకు మేనేజర్ సాయికిరణ్ పాల్గొన్నారు.

### కాల్వకట్టకు గండికొట్టి నీటి తరలింపు

**పాలకవీడు :** మండలంలోని యల్లాపురం గ్రామసమీపంలో గల ఎన్నెస్పీ ఆర్-11 మైనర్‌కాల్వకు పలువురు రైతులు బుధవారం గండికొట్టి నీటిని తరలిస్తున్నారు. దీంతో సమీప, శివారు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గండి కొట్టడంతో పాలకవీడు, సజ్జాపురం రైతులు నాట్లు వేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. అధికారులు తక్షణమే గండిని పూడ్చాలని డిమాండ్ చేశారు.

### అనాథ పిల్లలకు అన్నదానం

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో గల అనాథ ఆశ్రమంలోని పిల్లలకు పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాచిమంచి గిరిబాబు జయంతి సందర్భంగా బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, న్యాయవాదులు నారపరాజు శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణ, వాసుదేవరావు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని వినతి

**మునగాల :** మునగాల మేజర్ గ్రామపంచాయతీలో కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందున వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. ఈ మేరకు బుధవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, స్థానిక తహసీల్దార్ వి.ఆంజనేయులు, వైద్యాధికారిణి దివ్యలకు వినతిపత్రం అందజేశారు.

**నేరేడుచర్ల :** సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని బుధవారం ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డికి సీపీఐ, బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, నవీన్‌కుమార్, సతీష్‌రెడ్డి, లక్ష్మి, సత్యం ఉన్నారు.

### అన్నదాన సత్రం అభివృద్ధికి సహకరించాలి

**మఠంపల్లి :** మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి రెండు తెలుగురాష్ట్రాల రెడ్డి కులస్తులు సహకరించాలని నిత్యానదాన సత్రకమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి కోరారు. బుధవారం జరిగిన సత్రకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగిరెడ్డి, మాజీ అధ్యక్షుడు అన్నెం శౌరిరెడ్డి, లక్ష్మి, మల్లేశ్వరి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**మునగాల :** మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన నాగార్జునపు మధు గత జూలై 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. దీంతో మధు కుటుంబానికి 1998-99బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.32,500 ఆర్థికసాయం బుధవారం అందజేశారు.

### సమస్యలు పరిష్కరించాలి

**నడిగూడెం :** మోడల్‌స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మోడల్‌స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిపాటి క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని కరివిరాల మోడల్‌స్కూల్ ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేసిన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె.షరీఫ్, ఉపాధ్యాయులు సుభాషిణి, వీరబాబు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, లింగరాజు, జ్యోతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.